క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. శాయంపేటలోని అవంతి స్కూల్ ప్రాంతంలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, శ్రీరామ హిల్స్, న్యూశాయంపేట బస్టాండ్ ప్రాంతంలో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు, శ్రీరామకాలనీ ప్రాంతంలో సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు, రంగంపేట ఫీడర్‌లోని భద్రకాళి ఆలయం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగంపేట, ఎంజీఎం క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, రాంపూర్‌లోని రామకృష్ణ కాలనీ, జాతీయ రహదారి ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణం, ఎన్పీడీసీఎల్ స్టోర్స్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నదీమ్ అర్షద్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు మహ్మద్ నదీమ్ అర్షద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టస్ ఆఫ్ కాటన్ మార్కెటింగ్ ఇన్ తెలంగాణ స్టేట్ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నదీమ్ అర్షద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ పర్యవేక్షణలో నదీమ్ అర్షద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

జాగ్రత్తలతో మధుమేహం దూరం

హన్మకొండ చౌరస్తా: ఆహార నియమాలు, జాగ్రత్తలు పాటిస్తే మధుమేహ వ్యాధిగ్రస్తులు సాధారణ జీవితాన్ని గడపొచ్చని డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు అన్నారు. 'డయాబెటిస్ ఎగ్జిబిషన్ – ఎడ్యుకేషన్' అంశంపై హనుమకొండ చౌరస్తాలోని కేర్ డయాబెటిక్ సెంటర్‌లో ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు చౌరస్తాలోని సెంటర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

చెన్నకేశవస్వామి కల్యాణం



మడికొండ: మడికొండలోని శివకేశవ ఆలయంలో చెన్నకేశవస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అనుముల నవీన్‌శాస్త్రి, వంశీకృష్ణ చార్యుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. వేడుకల్లో తౌటిరెడ్డి విద్యాసాగర్‌రెడ్డి, దొంతుల శంకర్‌లింగం, ఆలయ కమిటీ సభ్యులు తౌటిరెడ్డి సుదర్శన్ రెడ్డి, పింగిళి రఘునాథరావు, గందె సురేష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన స్వర్ణ



వరంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ వరంగల్ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిస్థితితో పాటు వరంగల్ జిల్లా పార్టీ పరిస్థితులను రేవంత్‌రెడ్డికి వివరించినట్లు ఆమె తెలిపారు.

భద్రకాళిని దర్శించుకున్న సినీహీరో గోపిచంద్

ఖిలా వరంగల్: భద్రకాళి దేవాలయాన్ని సినీహీరో గోపిచంద్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భద్రకాళిని దర్శించుకున్న గోపిచంద్‌కు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో బేటీ బచావో.. బేటీ పడావో



కాజీపేట రూరల్: బాపూజీనగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమృద్ధి సుకన్య యోజన పథకంలో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌ను చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ టీచర్ వినోద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత, రాజ్యలక్ష్మి, వనజ, పీఆర్‌ఐ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

బ్యాంకు అక్కడ.. ఖాతాదారులు ఇక్కడ

- వరంగల్‌లో దామెర ఏపీజీవీబీ శాఖ
- 24 ఏళ్లుగా వినియోగదారులకు ఇక్కట్లు



వరంగల్‌లో కొనసాగుతున్న దామెర ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు

దామెర : ఆ బ్యాంకు పేరుకే దామెర శాఖ.. కానీ నిర్వహణ మాత్రం వరంగల్‌లో కొనసాగుతోంది. మండల కేంద్రంలో ఉండాల్సిన బ్యాంకును వరంగల్ నగరానికి తరలించడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మండల కేంద్రంలో 7 అక్టోబర్ 1982లో వరంగల్ లోనే మొట్టమొదటి గ్రామీణ శాఖగా ఏర్పాటు చేశారు.

బ్యాంకు తరలించేందుకు కారణాలు

దామెరతో పాటు చుట్టుప్రక్క ప్రాంతాలు గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా వుండేవి. మావోయిస్టుల కార్యకలాపాలు కూడా అధికంగా ఉండేవి. దామెర బ్యాంకును పేల్చేందుకు రెండు సార్లు ప్రయత్నించారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా దామెర బ్యాంకును వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతానికి తరలించారు. అయితే అక్టోబర్, 2016లో దామెరను నూతన మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌తో పాటు మండల కార్యాలయాలు ఏర్పాటు అయ్యాయి. బ్యాంకును కూడా దామెరకు తరలిస్తే భద్రతా పరంగా ఎలాంటి సమస్య ఉండదని గ్రామస్తులు, ఖాతాదారులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకు పనులతో పాటు ఇతర కార్యాలయాల పనులు సులువు అవుతాయంటున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖాతాదారులు..

24 సంవత్సరాలుగా మండల కేంద్రంతోపాటు సింగరాజుపల్లి, కోగిల్వాయి, వెంకటాపూర్, కొత్తపేట, ఒగ్లాపూర్ గ్రామాలు ఈ శాఖ పరిధిలో ఉండటంతో ఆయా గ్రామాల ఖాతాదారులు లావాదేవీలు జరిపేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్‌కు రావాలంటే రోజుమొత్తం కేటాయించాల్సి వస్తుందని అంటున్నారు.

బ్యాంకును దామెరకు తరలించాలి



బ్యాంకు పనుల కోసం వరంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఒక రోజు సమయం మొత్తం బ్యాంకు పనికే గడుస్తుంది. వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకును దామెరకు తరలించేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చొరవచూపాలి. లేదా మరేదైనా బ్యాంకుశాఖను మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– గురిజాల శ్రీరాంరెడ్డి, దామెర మాజీ సర్పంచ్

ప్రతినెలా ఇబ్బందులు తప్పడంలేదు



ప్రతినెలా డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన డబ్బులను బ్యాంకులో జమ చేయాల్సి ఉంటుంది. బ్యాంకు నుంచి మంజూరు అయ్యే లోన్లు పొందాలంటే గ్రూపులోఉన్న సభ్యులందరూ వెళ్లి సంతకాలు చేయాల్సి వస్తుంది. అలాంటప్పుడు ఒక మహిళా సంఘంలో సభ్యులుగా వుండే 12 మంది ఒకేసారి వరంగల్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు విన్నవించుకున్నా చొరవచూపడంలేదు.

– దామెరుప్పల జయమ్మ, మహిళా మండలి సభ్యురాలు

మార్మోగిన శివనామస్మరణ

- ఘనంగా శివాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

దామెర : శివనామస్మరణతో మండల కేంద్రం మార్మోగింది. దామేశ్వరాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం జలాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, సామూహిక హోమాన్ని ఘనంగా నిర్వహించారు. భద్రకాళి శేషుతో పాటు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పండుగా వాతావరణం నెలకొంది. ఫల, పుష్ప, నవధాన్యాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివం ట్రస్టు చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా ఆదివారం చివరిరోజున ధ్వజస్తంభం, దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఉదయం 9.45 గంటలకు గన్నవరం శ్రీభువనేశ్వరీ పీఠాధీశ్వరులు కమలానంద భారతీ స్వామిచే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్, ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్‌రెడ్డి, డాక్టర్ శ్రీరాం రెడ్డి, ట్రస్టు సభ్యులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సత్యవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ కల్పన కృష్ణమూర్తి, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



పోచయ్య (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని భీంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లపల్లి పోచయ్య (72) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంపల్లి సర్పంచ్‌గా, గౌడ సంఘం అధ్యక్షుడిగా సేవలందించిన పోచయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. పలువురు బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు.

సేవా దృక్పథంతోనే సమాజంలో మార్పు



కేక్ కట్‌చేస్తున్న రాంనర్సింహారెడ్డి

శాయంపేట : సేవా దృక్పథంతోనే సామజంలో మార్పు సాధ్యమవుతుందని కేఎస్‌ఆర్ ట్రస్ట్, ఆర్‌ఎస్‌ఆర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేవీ రాంనర్సింహారెడ్డి అన్నారు. ట్రస్ట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అనే నినాదంతో ముందుకెళ్తున్నామని ఆయన అన్నారు. నిరుపేదలకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మారెపల్లి కట్టయ్య, వరదరాజు, రాజేందర్, చిరంజీవి, సుదర్శన్, సాయి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలి



కూలీల వివరాలు సేకరిస్తున్న ఏపీఓ శారద

దామెర : మండలంలోని జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతిఒక్కరూ ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలని ఎంపీడీఓ గుమ్మడి కల్పన సూచించారు. మండలంలోని తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులకు కూలీలు అధిక శాతం హాజరయ్యే విధంగా చూడాలని అన్నారు. ప్రతిరోజు రూ. 272 రూపాయల కూలీ చెల్లించనున్నట్లు వెల్లడించారు. జాబ్‌కార్డు కలిగిఉన్న వారు 100 పనిరోజులు పూర్తి చేయాలని కోరారు. ఆమె వెంట ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

తల్లిదండ్రుల పోషణ పిల్లల బాధ్యత



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : తల్లిదండ్రుల పోషణ పిల్లల బాధ్యతని వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేపాల నర్సింహరాములు అన్నారు. తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం–2007ను చట్టపరంగా అమలు చేసి వృద్ధులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ సత్యనారాయణ, సీఐ రవిరాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈనెల 4న జరిగే వయోవృద్ధుల అవగాహన సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. వయోవృద్ధుల నుంచి ఏలాంటి ఫిర్యాదులు వచ్చినా పరిష్కరించేందుకు ఆర్డీఓ పరిధిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లో వృద్ధమిత్ర కమిటీని ఏర్పాటు చేసి వృద్ధుల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బూచి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కోడెపాక సమ్మయ్య, కోశాధికారి సుధాకర్, ప్రచారకార్యదర్శి సుంకర రామన్న, బాణాల మొగులయ్య, పోరండ్ల కైలాసం, రాఘవరెడ్డి, ముదురుకోళ్ల సంపత్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన ముప్పు వీరస్వామి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా 50కిలోల బియ్యం అందించారు. నాయకులు రమేష్, మహేందర్, భీమ్‌రాజ్, బుచ్చిరెడ్డి, చందర్, సంపత్, రాణాప్రతాప్, ఖుషి, కుమార్ తదితరులు ఉన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి



కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

శాయంపేట : క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి అన్నారు. ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామీణ క్రీడా మైదానంలో అంగన్‌వాడీ టీచర్లకు ఖోఖో, కబడ్డీ క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మహిళల ఎదుగుదలతోనే దేశ పురోగతి పెంపొందుతుందని అన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, జ్యోత్న్న, కవిత, శ్వేత, స్వప్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

నడికూడ : ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి అన్నారు. చిన్నారుల్లో అంగవైకల్యాన్ని నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమంలో అందరూ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ కొత్తూరి ఇంద్రసేన, మాజీ ఉపసర్పంచ్‌లు దబ్బెట అశోక్, ఈసంపల్లి ఉపేందర్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జనగాని ప్రభాకర్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు జయ్‌పాల్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకుడు సదానందం, బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్, అశోక్, పాపయ్యగౌడ్, యూత్ క్లబ్ అధ్యక్షుడు రాజమౌళి ఉన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజుగౌడ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ గుండె బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సేవ చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో పూట గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానంతో పాటు జీఓ 51ని రద్దు చేయాలని, జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంటు చేయాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. సహజ మరణానికి అందించే బీమాను రూ.5 లక్షలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జీపీ కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మృతి చెందిన కార్మికుడి దహన సంస్కారాలకు ఇచ్చే రూ.10 వేలను రూ.20 వేలకు పెంచాలని, ఏడాదికి మూడు జతల దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలుకు నగదు రూపంలో అలవెన్సుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ధర్ముల రాంమూర్తి, మండల అధ్యక్షుడు మాట్ల భాస్కర్, గొల్లె మహేందర్ పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఐనవోలు : మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం ఎల్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాంనగర్ రైతువేదికలో నాబార్డు వారి సహకారంతో సహాయ సోషల్ సర్వీస్‌సేవా సొసైటీ వారి ఆధ్వర్యంలో ఎల్‌ఈడీపీ కార్యక్రమం చేపట్టారు. కక్కిరాలపల్లి, రాంనగర్, పెరుమాండ్లగూడెం, గర్మిళ్లపల్లి గ్రామాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు ట్రెనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కూరగాయలు సాగు చేయడం, మహిళ రైతులకు సోలార్ డ్రైయింగ్ టెక్నాలజీ ఫర్ వెజిటేబుల్స్ అనే 7 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది చొప్పున 4 బ్యాచ్‌లకు మొత్తం 120 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కూరగాయలు సాగు చేసే రైతులు మార్కెట్‌లో సరైన ధర లేనప్పుడు పెట్టుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. సోలార్ డ్రైయింగ్ టెక్నాలజీ ద్వారా టమాట, బెండ, వంకాయ, కాకర, మునక్కాయ, కరివేపాకు, నిమ్మ మొదలైన వాటిని సోలార్ డ్రైయర్‌లో ఉంచి ఒకటి, రెండు రోజుల్లో పూర్తిగా డ్రైచేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ అధిక లాభాలు పొందుతున్నట్లు చెప్పారు. దీంతో ఎలాంటి ఖర్చు లేదన్నారు. ట్రెనింగ్ అనంతరం మహిళలు ఈ పద్ధతిని పాటించి కూరగాయలు విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, ఏడీఏ దామెదర్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ మానస, ఎంఏఓ కవిత, ఐనవోలు రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు భిక్షపతి, యాకూబ్, మోహన్, సహాయ సంస్థ కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది కరుణ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలు గడువులోగా పరిష్కరించాలి

- ఆర్డీఓ నారాయణ



పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

శాయంపేట : ధరణి పోర్టల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను ఈనెల 9వ తేదిలోగా పరిష్కరించాలని ఆర్డీఓ కన్నం నారాయణ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 122 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తిరస్కరింపబడిన దరఖాస్తుదారునికి సేత్వారు చూపించి కారణం తెలుపాలన్నారు. తహసీల్దార్ సుభాషిణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి పాల్గొన్నారు.

దామెర : పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. శనివారం మండలంలోని ఊరుగొండ, ఒగ్లాపూర్ గ్రామాల్లో పర్యటించి ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ ఖురేషి, ఆర్‌ఐలు భాస్కర్‌రెడ్డి, సంపత్, కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

'బండి సంజయ్' వైఖరి సరికాదు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఐనవోలు : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వైఖరి మార్చుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గౌడల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పొన్నం ప్రభాకర్ కుటుంబాన్ని ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడటం అవివేకమన్నారు. రాజకీయ ప్రయోజనాలకోసం పొన్నం కుటుంబంపై విమర్శలు చేయడం బండి సంజయ్‌కి తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, రాము, సత్యం, గడ్డం శ్రీనివాస్, కత్తి దేవేందర్, తాళ్లపల్లి వెంకన్న, బండి సంపత్, సంపత్, శ్రీనివాస్, రాజు, రాజు, శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, రవి, ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ ప్రథమిక ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. 1998–99 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసున్నారు. పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R): 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O): 9177258410 (హన్మకొండ)